క్లుప్తంగా

అదనపు ఎస్పీకి వీడ్కోలు



అదనపు ఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: ఉత్తమ సేవలందించడంతోనే ప్రభుత్వ అధికారులు గుర్తింపు పొందుతారని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వెళుతున్న అదనపు ఎస్పీ భీమ్‌రావుకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అదనపు ఎస్పీగా పనిచేసిన భీమ్‌రావు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, రాములు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వేణు, సైదులు, సీఐలు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, కరుణాకర్, శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం అన్నపూర్ణ మండల సమైక్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిర మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళ సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలు దావనపల్లి సరోజ, ప్రధాన కార్యదర్శి దుంపెట గంగజల, సీసీలు గంగారాం, మరియ, శ్రీనివాస్, విద్యాసాగర్, రూరల్ మండల సమైక్య అధ్యక్షురాలు మారు సత్తమ్మ, శ్రీలత, కవిత, సునీత పాల్గొన్నారు.

పుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ అన్నారు. పట్టణంలో జాతీయ రహదారి వెంట పుట్‌పాత్‌లపై ఉన్న తోపుడు బండ్లతో పాటు ఇతరత్రా వాటిని మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పుట్‌పాత్‌ల ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు సహకరించాలని కోరారు. అలాగే 4 వార్డులో కోర్టు ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఓ అక్రమ నిర్మాణాన్ని తొలగించారు.

కాలువలు పరిశీలించిన అధికారులు



కాలువలు పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ శివారులో కొత్తకుంట, బందం కాలువ, మాటు కాలువలను ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. కాలువలకు గండ్లు, షట్టర్ల నిర్మాణం తదితర అంశాలను గంగపుత్ర సంఘ సభ్యులు ఏఈకి వివరించారు. కాలువ మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు అందించాలని కాంగ్రెస్ నాయకుడు గుగ్గిళ్ల సురేశ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో తుక్కయ్య, చిట్యాల రెడ్డి, సత్యనారాయణ, నర్సయ్య, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జగిత్యాల: ఇంటర్ కళాశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. మంగళవారం డీఐఈవో నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, నీట్, ఐఐటీ, మెయిన్స్ పేరిట అత్యధికంగా వసూలు చేస్తున్నారని, అలాగే కనీసం ఫీజు బోర్డులు లేక ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాంచంద్రం, సంజయ్, కార్తీక్, విఘ్నేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిధుల లేమి ... నిలిచిన పనులు

- పలు గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన పనులు
- బిల్లులు రాక పనులు చేయని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ధర్మనాయక్ తండాలో ఆగిపోయిన గ్రామపంచాయతీ భవనం

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా.. బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. సకాలంలో బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది.

వివిధ పథకాల కింద నిధులు మంజూరు

గ్రామాల్లో వివిధ పథకాల కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పనులు చేపట్టడానికి పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసినప్పటికీ, పనులు కొనసాగుతున్న దశలకు అనుగుణంగా వెంటవెంట నిధులు జమకాకపోవడంతో పనులు పూర్తి కావడం లేదు.

ధర్మనాయక్‌తండా గ్రామపంచాయతీ భవనం

మండలంలోని నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామపంచాయతీకి భవన నిర్మాణం కోసం ఎస్టీ ఎస్‌డీఎఫ్ కింద రూ. 20 లక్షలు 2024లో మంజూరు చేసిన పనులను జనవరి 20న ప్రారంభించారు. పనులు పిల్లర్ల వరకు అధికారులు రూ. 7.50 లక్షలు వరకు పనులు పూర్తి చేసినా, ఇప్పటి వరకు ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

➡ సారంగాపూర్ ఎస్సీ కాలనీలో 2024 మార్చి-ఏప్రిల్ నెలలో ఈజీఎస్ కింద రూ. 15 లక్షలతో మురికి కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. రూ.7 లక్షల వరకు పనులు పూర్తయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లింపులు జరగక పనులు నిలిచిపోయాయి.

➡ భీంరెడ్డిగూడెం గ్రామపంచాయతీ భవనానికి రూ.20 లక్షలు మంజూరైనా నిధులు బిల్లులు రావని పనులు నిర్వహించడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

➡ మ్యాడారంతండా, లచ్చనాయక్‌తండా, నాయికపుగూడెం గ్రామపంచాయతీ భవనాలు స్లాబ్‌ల వరకు ఈజీఎస్ నిధులతో పూర్తి చేశారు. బ్యాలెన్స్ పనులు పూర్తి చేయాల్సి ఉండగా పనులు పూర్తి చేస్తే డబ్బులు జమ కావడానికి జాప్యం అయ్యే అవకాశం ఉందని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➡ లచ్చనాయక్‌తండా గ్రామంలో కమ్యూనిటీ భవనం రూ. 4.60 లక్షలతో పనులు చేసి ఏడాది దాటినా బిల్లులు రాలేదు, భీంరెడ్డిగూడెంలో రూ. 2.30 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ భవనం పనులు పూర్తి చేసి ఏడాది దాటినా బిల్లులు రాలేదు, మ్యాడారంతండాలో రూ. 5 లక్షలతో చేపట్టిన మురికి కాల్వ నిర్మాణం 16 నెలల కింద పనులు పూర్తి చేసినా బిల్లులు రాలేదు, రేచపల్లి గౌత్రాల సంఘ భవనం రూ. 2.70 లక్షలతో చేపట్టిన పనులు పూర్తి చేసి 8 నెలలు దాటినా బిల్లులు రాలేదని పనుల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



సారంగాపూర్ ఎస్సీ కాలని నిర్మాణ పనులు ఆగిపోయి ఏడాది అయింది. చేసిన పనులకు ఒక్క రూపాయి రాలేదని కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేయడం లేదు, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పనులు సత్వరమే పూర్తి చేయాలి.

– నలువాల సుమన్, సారంగాపూర్:

బిల్లుల జాప్యం సరికాదు



ప్రభుత్వం పనులకు అవసరమైన మేర నిధులను అందించి చేపట్టిన పనులను పూర్తి చేసి, మా గిరిజన తండాకు గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి తీసుకురావాలి, అధికారులు సాంకేతిక కారణాలు చూపుతూ పనులు జాప్యం చేయడం సరికాదు.

– భూక్య సంతోష్, ధర్మనాయక్‌తండా

15 రోజుల్లో నిధులు జమవుతాయి

గ్రామాల్లో చేపట్టిన పనులకు పలు సాంకేతిక కారణాలతో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. అభివృద్ధి దశలో ఉన్న పనులకు మరో 15 రోజుల్లో బిల్లులు జమ అవుతాయి. వెంటనే పనులు పూర్తి చేస్తాం.

– రాజమల్లయ్య, ఏఈ పీఆర్, సారంగాపూర్

రైతు భరోసా సంబరాలు

కోరుట్లరూరల్/ధర్మపురి/రాయికల్/మెట్‌పల్లి/కథలాపూర్/పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్: ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు విడుదల చేయడంతో పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కోరుట్ల మండలంలోని పలు రైతు వేదికల్లో సంబరాలు జరుపుకున్నారు.ధర్మపురి అంబేడ్కర్ కూడలి వద్ద, పెగడపల్లి అంబేడ్కర్ చౌరస్తా వద్ద,రాయికల్‌లోని శివాజీ విగ్రహం వద్ద, మెట్‌పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో, కథలాపూర్ మండల కేంద్రంలో సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, అడ్లూరి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ధర్మపురి,రాయికల్‌లో సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు




సారంగాపూర్, కథలాపూర్‌లో సీఎం, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

విద్యుత్ అధికారులూ.. కరుణించరూ



మల్లాపూర్‌లోని సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న కుస్తాపూర్ గ్రామ రైతులు

మల్లాపూర్: వానా కాలం సాగు కోసం ఓ వైపు రైతులు సమాయత్తం అవుతుంటే మరో వైపు కరెంట్ లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కుస్తాపూర్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి పంటల సాగుకు ఇబ్బంది అవుతోంది. నార్లు పోయడానికి రైతులు ప్రయత్రం చేస్తుంటే కరెంట్ లేక మోటార్లు నడవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి 15 రోజుల గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఇది కేవలం ఒక్క రైతు సమస్య కాదు.. పాడైన రెండు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని బాధిత రైతులందరి గోడు. దీంతో పంటలు సాగు చేస్తున్న ఆ రైతన్నలు కరెంట్ అధికారులు.. కరుణించండి అంటూ వేడుకుంటున్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం కుస్తాపూర్‌కు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. రెండు వారాలుగా మొలకదశలో పంటలకు సాగునీరందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, ఇప్పటికైనా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

జగిత్యాల: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. మంగళవారం ఓల్డ్ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గంజాయి, సిగరెట్లు, అల్కాహాల్ పదార్థాలకు బానిస కాకూడదని, ఎంత మంది ప్రోత్సహించినా వాటికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి నిల్వలను గుర్తించినచో 112కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐఎంఏ భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్, శ్రీపతి, గీతిక పాల్గొన్నారు.

వెల్గటూర్ : ఎండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సీఐ రాం నర్సింహారెడ్డి విద్యార్థులకు అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా , పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్సై శ్రీధర్‌రెడ్డి, ట్రైనీ ఎస్సై సతీష్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల ఎస్సై సుదీర్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలె శేఖర్, డైరెక్టర్ నిఖిల్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మల్యాల సీఐ రవి విద్యార్థులకు ఆంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఎస్సై సందీప్, ప్రిన్సిపల్ వేణు,తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహరెడ్డి అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌కుమార్, పశువైద్యాధికారి వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల: యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని ఎస్సై రాంచంద్రం గౌడ్ అన్నారు. పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

▸ సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ అసోసియేషన్ (సీఐటీయూ)రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రజిత పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారికి సమ్మె నోటీస్ అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ కోమటి చంద్రశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

▸ విద్యార్థులకు ఇస్రో పర్యటన

మేడిపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి, మన ఊరు పౌండేషన్ వల్లంపల్లి సంస్థ ఆధ్వర్యంలో ఇస్రో పర్యటన తీసుకువెళ్లారు. వైజ్ఞానిక యాత్రకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆది శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు.

▸ రైతు సదస్సు విజయవంతం చేయాలి

రాయికల్: మండలంలోని భూపతిపూర్, అల్లీపూర్, మైతాపూర్ గ్రామాల్లో మంగళవారం రైతుసదస్సు కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అల్లీపూర్‌లో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఏవో ముక్తేశ్వర్ పాల్గొన్నారు.

▸ రైతు భరోసా విజయోత్సవాలు వీక్షణ

సారంగాపూర్: ప్రభుత్వం రైతులకు వానాకాలం పంటకు రైతు భరోసా నిధులు తొమ్మిదివేల కోట్లు జమ చేసిందని మండల ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీవో చౌడారపు గంగాధర్, వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం రైతు సంబురాల్లో భాగంగా రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేష్, అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మల్యాల, మానాల, తాటిపల్లి రైతు వేదికల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా విజయోత్సవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు, నాయకులు వీక్షించారు. ఎంపీడీవో స్వాతి, ఏవో చంద్రదీపక్, రైతులు పాల్గొన్నారు.

▸ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వైద్యపరీక్షలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల, గంభీర్‌పూర్, పోతారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోరుట్ల క్లస్టర్ వైద్యాధికారి సురేంద్ర, హెచ్ఎంలు సుధాకర్‌రెడ్డి, స్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

▸ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని చింతకుంట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేములవాడకు చెందిన ఆద్య గోలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 300 స్కూల్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు గోలి దేవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆశ్రీ సొసైటీ వ్యవస్థాపకులు పూర్ణి కిశోర్ కుమార్తె పూర్విక రామ్ మొదటి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం రూ.35 వేల విలువ గల నోట్‌బుక్స్, ఇతర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు.

▸ రైతు బీమా చెక్కు అందజేత

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన రైతు రుద్రవేణి చిన్న పోశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య రుద్రవేణి భూమక్కకు మంజూరైన రైతు భీమా రూ. 5 లక్షల చెక్కును కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, కాంగ్రెస్ నాయకులు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, ముక్కెర లింబాద్రి పాల్గొన్నారు.

▸ రైతుభరోసా రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి

కథలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా డబ్బులు ఎకరానికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని రైతు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కథలాపూర్‌లో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇప్పుడు రైతు భరోసా డబ్బులు ఇచ్చిందన్నారు. సమావేశంలో రైతు ఐక్యవేదిక నాయకులు గడ్డం శేఖర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్, పుర్కుటపు గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, జవిడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పని చేస్తున్నందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాలలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అప్పారావు పేట గ్రామానికి చెందిన పొన్నం హన్మంతు, నాచుపెల్లి గ్రామానికి చెందిన బొడ్డేలి నాయకయ్య ఇటీవల మృతి చెందగా, రైతు ప్రమాద బీమా రూ. 5 లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ల చెక్కులు అందించారు. అనంతరం కొడిమ్యాల ప్రెస్ క్లబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మండల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మహిళలు ఆర్థిక సాధికారికత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన శివసాయి స్వశక్తి సంఘం సభ్యురాలు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2లక్షలు అప్పు తీసుకోగా, అనారోగ్యంతో మృతి చెందగా, ప్రమాద భీమా కింద రూ.10 లక్షలు మంజూరు కాగా, బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, తహశీల్దార్ వసంత, ఏపీఎం రాజయ్య, డీపీఎం విజయభారతి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కథలాపూర్: మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్ట్ పోస్టుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనిత మంగళవారం తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్టులో పీజీ, బీఎడ్ పూర్తిచేసి టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాడానికి అర్హులన్నారు. ఈనెల 25వ తేదీ సాయంత్రంలోగా మోడల్‌స్కూల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26న డెమో క్లాస్ నిర్వహిస్తామన్నారు.

సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 6,7,8 వ తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత మంగళవారం తెలిపారు. జూలై 2న ఉదయం 11 గంటలకు పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ జాబితా ప్రకారం సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాములు గౌడ్

పెగడపల్లి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పని చేస్తూ యార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ అన్నారు. పాలకవర్గం సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు ద్వారా వర్షాకాలం పంటల ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, కార్యదర్శి వరలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, గంగరాజం, మల్లయ్య, కిషన్, అంజన్న నాయక్, మహేశ్, తిరుపతి, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మీరాజం, లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

జగిత్యాల: విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమని, వాటిపై నైపుణ్యం పెంచుకోవాలని ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఎస్ఎస్వీ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పర్సనల్ స్కిల్స్ రెస్యూమ్ ప్రిపరేషన్, గ్రూప్ రిస్కర్షన్, ప్రజేంటేషన్ స్కిల్స్, టెలిఫోనిక్ రౌండ్‌తో పాటు ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలు ఎలా అదిగమించాలన్నదానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపల్ మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరిహరామృతం పుస్తకం ఆవిష్కరణ

ధర్మపురి: పట్టణానికి చెందిన ప్రముఖ కవయిత్రి బుగ్గారపు సులోచనాదేవి అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడానికి హరిహరామృతం భక్తి గీతాల పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించాలనుకున్నా.. తన ఆరోగ్యం సహకరించక పోవడంతో ఆమె కోరిక మేరకు తన కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు పెండాల మహేందర్, చంద్రశేఖర్, జన్మంచి నర్సయ్య, బుగ్గారపు నరహరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

జగిత్యాలటౌన్: పెరుగుతున్న కాలుష్యం, వాతావరణంలో వస్తున్న మార్పులు,గ్లోబల్ వార్మింగ్ నుంచి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి కోరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాగిళ్ల సత్యనారాయణ, తిరుపతి, జుంబర్తి దివాకర్, కస్తూరి సత్యం, ఆముద రాజు, గడ్డం లక్ష్మి, మమత, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

బంజారాలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల మంది ఉన్న బంజారా(లంబాడ)లకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని అఖిల భారత బంజారా(గిరిజన) సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య గోవింద్‌నాయక్ అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడిగా బానోత్ రవినాయక్(గొర్రెపల్లి), ప్రధాన కార్యదర్శిగా బానోత్ రమేష్‌నాయక్‌లను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేష్, గిరిజన నాయకులు రాందాస్‌నాయక్, బోడ శేఖర్, ఆజ్మీర లక్ష్మణ్, గుగ్లావత్ శేఖర్, బానోత్ భూమ, బోడ గంగాధర్, భాస్కర్ పాల్గొన్నారు.